# క్షమాపణ

గాడ్స్ క్రియేషన్‌లో అత్యంత ముఖ్యమైనదేమిటీ అని గిరీశం అడిగితే 'చేగోడీలు' అన్నాడు, వెంకటేశం. 'ఛీ! విడోస్' అన్నాడు గిరీశం. ఏ విషయం మీదైనా అభిప్రాయమనేది ఒక వ్యక్తి యొక్క అభిరుచిమీద సంస్కారం మీదా ఆధారపడి వుంటుంది.

వెంకట్రావుకి 'ప్రేమ' అంటే నిశ్చితమైన అభిప్రాయం వుంది. అతను ఎన్నాళ్ల నుంచో ఎన్నో సినీమాలు, టి. వి. సీరియల్సు చూస్తున్నాడు. కథలు నవలలు చదువుతున్నాడు. మరొకడెవడైనా అయితే ప్రేమంటే కేవలం శరీరాలకి మనస్సులకే పరిమితమైన ఆకర్షణతో ప్రేయసి ప్రియుడు వుత్తరాలు రాసుకోవడం, జంటగా నేలమీదా నీళ్లలోనూ, మంచాలమీద దొర్లడం, డ్యూయెట్లు పాడుకోవడం అనుకోవచ్చు. వెంకట్రావు విషయంలో ప్రేమంటే అలాంటి అల్లాటప్పా వ్యవహారం కాదు. అది పవిత్రమైన పరస్పర ఆత్మానుబంధం. పెళ్లనే నవ్యమైన భవ్యమైన, దివ్యమైన శాశ్వత బంధానికది ద్వారబంధం. తను ప్రేమించి పెళ్లి చేసుకోవాలి. కట్నం కానుకలు ఆశించకూడదు. భార్యనొక సహధర్మచారిణిగా గౌరవించాలి. తనొక ఆదర్శభర్తగా, ఆదర్శ పుత్రుడిగా ఆదర్శ అల్లుడుగా బంధుమిత్రుల ప్రశంసనందుకోవాలి. ఇదీ అతని ఆశయం.

అలాంటి తన ఆశయాలు ఫలించడానికి అన్ని అర్హతలు వున్నవాడు. డబ్బుపేరు ప్రతిష్ఠలున్న తల్లితండ్రులకుఏకైక పుత్రుడు, రూపవంతుడు, గుణవంతుడు. తల్లి తన మాట కాదనదు. తండ్రి తల్లిమాట కాదనడు.

వెంకట్రావు యమ్మెస్సీ ఫైనలియర్ చదువుతున్న రోజులవి. ప్రతిమంగళవారం ప్రతిగురువారం బియస్సీ ఫైనలియర్ విద్యార్థినీవిద్యార్థులు కెమిస్ట్రీ లేబరేటరీ మూడుగంటలకి విడిచిపెట్టడం, అదే సమయంలో యమ్మెస్సీ విద్యార్థినీవిద్యార్థులు ఆ లేబరేటరీలోనే మరో భాగంలో ప్రవేశిస్తూ ఎదురవ్వడం జరుగుతుంది.

ఒక రోజున అలాంటి సమయంలో అప్రయత్నంగా, బహుశా దైవికంగా, అతని దృష్టి దేవకన్యలాగ ఠీవిగా నడిచివెడుతున్న ప్రమీల మీద ఒక క్షణం నిలిచింది. మనసు కలవరపడింది. అయినా తమాయించుకున్నాడు. ఇలా నాలుగైదు వారాలుగా జరుగుతూ వొచ్చింది. విద్యార్థినీ విద్యార్థులు ఒకళ్ల నొకళ్లు చూసుకుంటూ ఎదురు పడే సందర్భాల్లో

విద్యార్థులుచేసే సకిలింపులు, వేసే వెకిలివేషాలు, చేసే వ్యంగ్య సంభాషణలు వెంకట్రావుకి అసహ్యం. విద్యార్థినిల్లో కూడా అలాంటి ప్రతి స్పందనలు కలిగిన సందర్భాలున్నాయి. అయితే ప్రమీలకూడ తనలాగే నిశ్చలంగా వుండేది.

ఒకసారి అతను ప్రమీలను ఆరాధనా భావంతో చూస్తున్న క్షణంలోనే ఆమెకూడా యితన్ని చూసింది. ఇలా రెండు మూడుసార్లు జరిగేక, అలా చూపులు కలిసిన ఒక శుభవేళ ఒక చిరునవ్వు విసిరేడు. అది మన్మథబాణంలా పనిచేసింది. అటుపైన రెండుమూడు వారాలుగా వాళ్ల మధ్య చిరునవ్వుల పువ్వులు విరిసేయి.

దీనితో తన ఆశయం ఫలించేసమయం ఆసన్నమైందేమోనన్న అభిప్రాయం కలిగింది. అయినా వెంకట్రావు తొందరపడే మనిషి కాదు. పరిస్థితులు ప్రతికూలంగా పరిణమించడం పసికట్టేడు. ఎంచేతనంటే వీళ్ల చిరునవ్వులు గమనించిన క్లాస్‌మేట్లు నీ గర్ల్‌ఫ్రెండ్ అని వెంకట్రావునీ, నీ బోయ్‌ఫ్రెండని ప్రమీలని ఆటలు పట్టించడం మొదలెట్టేరు. ఇలాగర్ల్ ఫ్రెండ్సుబోయ్‌ఫ్రెండ్సంటూ హద్దులుమీరే విద్యార్థినీ విద్యార్థుల బ్రతుకులెలా బ్రద్దలవుతాయో, వెంట్రావు ఎన్నో సినీమాల్లో చూశాడు, ఎన్నో నవలల్లో చదివేడు. నాటి నుంచీ క్రీగంటి చూపులు విరమించేడు. ఆమె పరిస్థితి కూడా డిటో. దాంతో వాళ్ల మధ్య చూపులు చిరునవ్వులు కరువయ్యేయి.

అప్పుడు వెంకట్రావుకి ప్రేమంటే ఏమిటో తెలిసింది. రోమియో జూలియట్లలాగ తాను ప్రమీలను కలవాలనీ మాట్లాడాలనీ, కలిసి పక్షుల్లాగ విహరించాలనీ అనిపించింది. తన చేతి కందేటంత దగ్గర్లో వుండీ దూరమౌతున్న ప్రమీలను తల్చుకుని దేవదాసులాగ విరహవేదన పడేవాడు. ఈ వేధింపులకు వెరచి తన మీద ప్రేమతో అనార్కలీలాగ చరిత్రపుటల్లో సమాధి అయిపోతున్నట్టు ప్రమీలను ఊహించుకుని ఉలిక్కిపడేవాడు.

తను ప్రమీలను ప్రేమిస్తున్న విషయం ఖాయం. ఆమె కూడా తనని ప్రేమిస్తున్నట్టుగానే వుంది. అది తేల్చుకోవాలి. ఏ విషయంలోనైనా స్నేహితున్ని సంప్రదించొచ్చు కాని ప్రేమ విషయంలో మాత్రం శ్రేయస్కరంకాదని ఎన్నో సినీమాల ద్వారా గ్రహించేడు. అంచేత ఆ విషయం స్వయంగానే తేల్చుకోడానికి నిర్ణయించుకున్నాడు. రాత్రి తన గదిలో ఇటూ అటూ పచార్లుచేస్తూ షెర్‌లాక్‌హోమ్స్ లాగ తీవ్రంగా ఆలోచించేడు. పథకం వేసేడు. కార్యరంగంలో ప్రవేశించేడు.

ఆమె నిత్యం చిన్న సైజు మోటారు సైకిల్ మీద కాలేజ్‌కొస్తుంది. తన స్కూటర్ మీద ఒక రోజున జాగ్రత్తగా ఆమె వెనకాలే ఫాలోఅయ్యేడు. కోలనీకి చివరగా సందుంది. ఆ సందు దాటగానే గేటున్న బంగాళా ముందు ఆమె స్లోడౌన్ అయింది. వాచ్‌మేన్

గేటుతలుపులు తెరిచాడు. ఆమెలోపలి కెళ్లి అదృశ్యమైంది. సందు మొగలో స్కూటర్ ఆపుకుని ఆ బంగళాగేటు సమీపించేడు. ఆ వాచ్‌మెన్ ఒక పోలీస్ సెంట్రి. చేతిలో తుపాకి పట్టుకుని ఎటెంషన్ పొజిషన్‌లో వున్నాడు. గేటు పక్కన గోడమీద 'కె. యం. క్రిష్ణ. క్రింద సూపర్నెంట్ ఆఫ్ పోలీస్' అని వుంది.

వెంకట్రావుని చూసి సెంట్రీ రెండడుగులు ముందుకేసి అతనికేసి చిదతపులావలోకనం చేసి తుపాకీ మీద చెయ్యిబిగించేడు.

"బ్రదర్. ఇది పోలీస్ సూపర్నెంట్ కె. యం క్రిష్ణగారిల్లా?" అడిగేడు వెంకట్రావు.

"అవును!" హుంకరించేడు సెంట్రి, తుపాకి భుజంమీంచి చేతిలోకి తీసుకుంటూ.

"ఇప్పుడు లోపలికెళ్లింది ఆయన కూతురా?"

"అవును. మీరెవరు? ఏంకావాలి?" గాండ్రించేడు సెంట్రి.

"కెయం క్రిష్ణగారంటే కాసుల మురళీకృష్ణగారేనా?" అడిగేడు వెంకట్రావు, కాస్త అమాయకత్వం నటిస్తూ.

"కాదు కలశం మోహన కృష్ణగారు." అన్నాడు సెంట్రీ, తుపాకీ దించి, వెంకట్రావుని నిరపాయకరమైన చవటగా జమకట్టి.

"నేను కాసుల మురళీ కృష్ణగారిల్లు వెతుక్కుంటూ ఈ తిరకాసు తెలియక కెయం క్రిష్ణరావుగారిల్లెక్కడని అడిగితే 'అదుగో ఆయన కూతురే ఆ మోటార్ సైకిల్ మీద వెడుతుంది' అని ఓ పెద్దమనిషి చెప్పేడు. అందుకే ఆమెని వెంబడిస్తూ ఇంత దూరం వొచ్చేను. అది సరే, ఈ యిల్లు దాటివెడితే ఇంకా ఇళ్లేమైనావున్నాయా?"

"వెడితే తిరిగొచ్చే యిళ్ళేమీ లేవు" అన్నాడు సెంట్రి.

"అంటే" పొడుపు ప్రశ్నలాగ తోచింది వెంకట్రావుకి.

"ఈ బంగళాదాటితే స్మశానమేమరి." అన్నాడు సెంట్రి చిరునవ్వు చిందిస్తూ.

"థేంక్స్ బ్రదర్. అటువెళ్లి ఇళ్లు వెతికే శ్రమ తప్పించేవు. ఇంద." అంటూ వాడిచేతిలో మడిచిన పదిరూపాయిలనోటు పదిలంగా వుంచేడు. మొదట్నుంచీ పోలీసువాళ్లన్నా వాళ్ల మృదువైన మాటలన్నా ఎనలేని గౌరవం.

సరే. ఆ ఇన్ఫర్మేషన్‌తో ప్రమీలకీ తనకీ మధ్యన జాతికులమత భేదాలు లేవని రూఢి అయింది. ఇంక తక్షణ కర్తవ్యం ఏమిటంటే ఆ అమ్మాయిని కలుసుకుని తన ప్రేమని విన్నవించాలి. ఆమె అంతసేపూ నిర్భయంగా నిస్సంకోచంగా నిలబడాలి, తన

మాటలు వినాలి, తన నిజాయితీని నమ్మాలి. ఆమె అభిప్రాయం మాటల్లో కాకపోయినా సౌంజ్ఞలలోనైనా తెలియచెయ్యాలి.

"ప్రమీలా! నేను నిన్ను ప్రేమిస్తున్నాను. ముందు పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. నువ్వు నన్ను ప్రేమిస్తే మీ తల్లితండ్రులతో సంప్రదించు. నీకు యిష్టం లేకపోయినా, నీ తల్లితండ్రులకి యిష్టలేకపోయినా ఈ వుత్తరాన్ని చింపి నా మొహంముందే విసిరి కొట్టు. నేను మళ్లీ నీవైపు చూడను. నా కుటుంబవివరాలు, ఎడ్రసు, టెలీఫోన్ నెంబరు ఈ దిగువనిస్తున్నాను. నీ సమాధానం కోసం గురువారం ఉదయం తొమ్మిది గంటలకి మీయింటి దగ్గరున్న సందుకి అవతల వెయిట్ చేస్తూవుంటాను." అని వుత్తరం రాసి జేబులో పెట్టుకున్నాడు. సోమవారం సాయంత్రం వాళ్లింటి ముందున్న సందుకవతల ఆమె మోటార్ సైకిల్‌ని ఓవర్‌టేక్ చేసి అడ్డగించి ఆమె ఆపిన తర్వాత ఆ చీటీ ఆమెచేతిలో వుంచి, ఆ చీటీని ఆమె పుస్తకాల సంచీలో పడేసుకోవడంచూసి తృప్తిగా గుండెలనిండా ప్రేమ పరిమళసంభరిత మలయమారుతాన్ని నింపుకుని వెంటనే వెనక్కి మళ్లేడు.

ఎందుకైనా మంచిదని వెంకట్రావు గురువారం ఎనిమిదిన్నరకే ఆ సందుమొగలో నిలబడ్డాడు. ఆ బంళాగేటు ముందున్న సెంట్రి ఎవడో కొత్తవాడు. తన వైపుతేరిపారి చూసి తనవైపు అప్పుడే అయిదారడుగులు వేసేడు. వాడడిగే ప్రశ్నలకు ఏం సమాధానం చెప్పాలా అని ఆలోచిస్తుండగా, దైవ వశాత్తూ తన దృష్టి ఆ సెంట్రీ దృష్టితోబాటు అటువైపే వొస్తున్న ఓ శవం తాలూకు ఊరేగింపుమీద పడింది. సూక్ష్మగ్రాహి అయిన ఆ సెంట్రి తనని ఆ వూరేగింపుతాలూకు పైలట్‌గా భావించి "శవాన్ని ఈ బంగళాముందర్నించి తీసుకెళ్లకూడదు. బంగలాకివతలే సందుంది, అందులోంచి తీసుకెళ్లాల" అంటూ చెయ్యిజాపి బాణం గుర్తుతో సహా 'స్మశానానికి దారి' అన్న బోర్డ్‌కేసి చూపెట్టి, తన పనైపోయినట్టు వెనక్కి తిరిగి 'లెఫ్ట్‌రైట్' స్థాయిలో అడుగులేస్తూ గేటు దగ్గిరకెళ్లిపోయేడు. ఈలోగా ఊరేగింపు సందుదాటి బంగళా ముందరున్న రోడ్‌వైపు రావడం చూసి సెంట్రి ఉగ్రుడై "చెబితే ఇనిపించుకోవేమయ్యా! ఆ బోర్డ్ చూళ్లేదూ!" అన్నాడు. పరిస్థితి గ్రహించిన ఆ ఊరేగింపులో వున్న ఓ పెద్దమనిషి "చూడు బాబూ! ఇలా కొత్తగా స్మశానానికో రోడ్ వేసేరని మాకు తెలీదు. పొరపాటు." అంటూ ముందుకు వెడుతుండగా ఊరేగింపు బంగళా దాటిపోయింది. ఆ సెంట్రీ వెంకట్రావు కేసి చురచురచూస్తూ "ఇయ్యాల్టికి వూరుకున్నాను. రేపట్నుంటి ఆ సందులోంచే తీసుకెళ్లాలి. సరే వెళ్లు." అన్నాడు వెంకట్రావుకి రోజూ ఇదే పనయినట్టు.

ఇంతలో కారు హారన్ మోగితే సెంట్రీ పరిగెత్తుకెళ్లి గేటుతీశాడు. కార్లో వున్న ఆఫీసర్ ఎవరితో ఘర్షణ పడుతున్నావని అడిగినట్టున్నాడు. సెంట్రీ సెల్యూట్ చేసి తనవైపు

వేలెట్టి చూపెట్టి తన వాక్శుద్ధితో తనని సమాధాన పరిచినట్టు చెప్పినట్టున్నాడు. వెంటనే కారు వొచ్చి వెంకట్రావు పక్కన ఆగింది. అందులో యూనిఫారంలో వున్న భారీ యెత్తు సూపర్నెంటు, ఇన్స్పెక్టర్‌తో సహా కారుదిగి వెంకట్రావు భుజం మీద చెయ్యివేసి "సారీ, యంగ్‌మేన్! మా సెంట్రీ ఏదో తెలివితక్కువగా వాగినట్టున్నాడు. డోంట్ మైండ్ హిం" అన్నాడు.

నిలువెత్తు పోలీసాఫీసర్, అందులోనూ తనకి కాబోయే మామగారు మాటలు వినగానే అతను భయాందోళనలు మంచులా కరిగిపోయాయి. తన రక్తం ధైర్యంతో వేడెక్కింది.

"నేను మీ అమ్మాయి ప్రమీలను కలుసుకోడానికొచ్చేను. నాపేరు వెంకట్రావు. నేను యెమ్మెస్సీ ఫైనలియర్ స్టూడెంట్‌ని" అన్నాడు వెంకట్రావు, చిరునవ్వుతో, ఈ పాటికి తన బయోడేటా అంతా ఆయన కంఠతా పట్టి వుంటాడన్న ధీమాతో.

"నీకు మా అమ్మాయి ఎలా తెలుసు?" అడిగేడు యస్.పి. ఆయనేదో హడావిడిగా వెడుతున్నాడు, వివరాలన్నీ చెప్పడానికి టైముండదని టూకీగా చెప్పేద్దామన్న వుద్దేశ్యంతో "నేను మీ అమ్మాయిని ప్రేమిం...." అన్నాడోలేదో చెంప చెళ్లుమంది. ఇన్స్పెక్టర్ వెంకట్రావు జబ్బ పట్టుగున్నాడు. ఆ యస్.పి. అంతటితో ఆగక ఉగ్ర నరసింహావతారం ఎత్తి "ఇన్స్పెక్టర్! ఈ రోడ్‌సైడ్ రోమియోగాణ్ణి స్టేషన్‌కి తీసుకెళ్లి మెత్తగా తన్ని ఈవ్‌టీజింగ్ కేస్ కింద బుక్‌చేసి వీడి ఫోటో అన్ని పత్రికలకీ పంపు" అంటూ గర్జించేడు.

వెంకట్రావు పాదాల కింద భూమి అమాంతంగా పాతాళంలోకి దిగిపోయింది. రెండు చేతుల్తోనూ యస్.పి. కాళ్ళు పెనవేసుకుని "నన్ను క్షమించండి సార్. నన్ను గురించి మీ అమ్మాయినడగండి. నేను ఏ తప్పయినా చేస్తే నన్ను షూట్ చెయ్యండి.. ప్లీజ్" అన్నాడు దెబ్బకి దేవేంద్రలోకం దర్శిస్తూ.

"యమ్మెస్సీ చదువుతూ మా కాలేజీలో నువ్వు నేర్చుకున్నదిదా! రాస్కెల్! ఊఁ.. మళ్లీ ఎప్పుడైనా మా అమ్మాయికేసి చూసినా పేరెత్తినా.. ఆ బోర్డ్‌చూడు... ఆ సందులోకి పంపిచేస్తాను ఖబడ్దార్... నౌ.. గెటౌట్" అని వార్నింగిచ్చి ఇన్‌సెక్టర్‌తోసహా కారెక్కి వెళ్లిపోయేడు. గుండెలు దడదడలాడుతుండగా పాతికగజాల దూరంలో వున్న స్కూటర్ దగ్గిరకెట్టేటప్పటికి పదేళ్లవయస్సు పెరిగనట్టయింది. దాంతో ప్రేమోపాసనా ఉద్యమం నుంచి విరమించేడు.

★ ★ ★

కాలేజీలో ప్రమీల అతనికేసి చూసిందో లేదో తెలీదు కాని వెంకట్రావు మాత్రం ఆమెను కన్నెత్తి చూడలేదు. దాని ప్రభావం వల్ల నాలుగేళ్లయినా ఆ దుస్సంఘటన పీడకలలాగ వెంకట్రావు మనస్సును వెంటాడుతూనే వుంది. తల్లితండ్రులకు్కూడా తమ ఏకైక పుత్రుడైన వెంకట్రావు వద్ద అతని పెళ్లి ప్రస్తావన తీసుకురాలేదు. రీజినల్ రిసెర్చ్ లేబరేటరీస్‌లో డాక్టరేట్ చేసి రిసెర్చ్ ఆఫీసర్‌గా రెండేళ్లపట్టి పని చేస్తున్న వెంకట్రావు విభాగంలో డాక్టరేట్ సంపాదించడానికి చేరిన విద్యార్థినీ విద్యార్థులలో ముఖ్యంగా విధ్యార్థినిల మొహంకేసి తలెత్తిసూటిగా చూడకుండా ముభావంగా వుండేవాడు. ఒక రోజున లంచ్ టైంలో తన భుజం మీద నిలిచిన మృదువైన హస్తంచూసి ఉలిక్కిపడి వెనక్కితిరిగేడు. "హల్లో! డాక్టర్ రావ్! నన్ను మరిచిపోయారా!" అన్న గొంతువిని ఆ విద్యార్థిని మొహం పరకాయించి చూశాడు. "ప్రమీలా!" అన్నాడు.

"ఊఁ.. జ్ఞాపకమున్నానే!" అంది ప్రమీల. ఈ అయిదేళ్లలోనూ ప్రమీల ఎంత మారింది! ఎంత అందంగా వుందీ! ఎంత హుందాతనం సంతరించుకుంది. ఆశ్చర్యపోయేడు.

"నిన్ను మరిచిపోగలనా! నువ్వు చేసిన మర్యాద మరిచిపోగలనా!" అన్నాడు వెంకట్రావు.

"ఎన్నాళ్ళ పట్టో మీకు క్షమాపణ చెప్పుకునే అవకాశం కోసం ఎదురు చూస్తూ వొచ్చేను." అంది ప్రమీల తలదించుకుని.

"ఇక్కడెప్పుడుచేరేవు?" అడిగేడు ఆమె వేసుకున్న ఏప్రన్‌చూసి, ఇంక ఆ దుర్ఘటన ప్రస్తావన తీసుకురాకుండా.

"వారం రోజులైంది. మీరే పలకరిస్తారని ఎదురుచూశాను. నన్ను చూశారో చూడనట్టు నటించేరో నాకు తెలియదు" అంది.

"నువ్వు చాలా మారిపోయేవు. నువ్వు పలకరించేక కాని ఆనవాలు పట్టలేకపోయేను."

"కారణం గ్రహించేరా? అప్పుడులేని స్వతంత్రతా ధైర్యం యిప్పుడొచ్చేయి."

"ఇప్పుడు భయం పోయిందని చెప్పడానికి పలకరించేవన్నమాట"

"అప్పుడు జరిగింది చెప్పడానికిప్పుడు అవకాశం దొరికింది. మీరు రాసిన చీటీ చూసుకుని ఎంతో ఆనందించేను. మా అమ్మకి చూపెట్టి నాన్నగారితో సంప్రదించమన్నాను. ఆ వుత్తరంచూసి, ఎవర్ని సంప్రదించేరో, ఏమాలోచించు కున్నారో, ఏం జరిగిందో

తెలియదు. మర్నాడు ఉదయం మా నాన్నగారు నన్ను పిల్చి, "మళ్లీ ఇంకోసారి ప్రేమా గీమా అంటే వాణ్నీ నిన్నూ కూడా కాల్చిపారేస్తాను. బుద్ధిగా చదువుకో. ఇంకా డిగ్రీ అయినా రాలేదు అప్పుడే ప్రేమా పెళ్లి అంటావా! మళ్లీ ఆ వెంకట్రావుగాడితో మాట్లాడినా, చూసినా నీ అంతు చూస్తాను." అని బెదిరించేరు. తెగించి మీకు టెలిఫోన్ చేద్దామన్నా వుత్తరం రాద్దామన్నా మీ ఎడ్రసు టెలిఫోన్ నెంబరు వున్న వుత్తరం నాన్నగారి దగ్గిరుండిపోయింది" అంది ప్రమీల తలదించుకుని.

"ఇప్పుడాలోచిస్తుంటే ఆనాటి సంఘటనవల్ల మనిద్దరికీ మంచే జరిగిందనిపిస్తుంది. ఆనాడు మీనాన్న గారిచ్చిన షాక్ ట్రీట్‌మెంట్‌తో మొదట్లో అవమానంతో కృంగిపోయినా తర్వాత అదే నా జీవితపరమావధి పట్ల కొత్త చైతన్యం కలిగించింది. చదువుపట్ల శ్రద్ధా పట్టుదలా పెరిగేయి."

"నిజమే. ఇప్పుడు మీ దగ్గిర రిసెర్చ్ స్టూడెంట్‌గా వుండటం ఎంత ఆనందంగావుందో తెలుసా! అప్పుడు మనప్రేమ ఫలించి పెళ్లి చేసుకునివుంటే మన జీవిత ప్రపంచ పరిధి ఎంత పరిమితంగా వుండేదో! అంతా మనమంచి కోసమే జరిగిందనిపిస్తుంది." అంది ప్రమీల.

"ప్రమీలా! మానసికంగా కూడా నువ్వు ఎంతో ఎదిగేవు. ఇప్పుడు ధైర్యంగా నిజం చెప్పు. నువ్విప్పుడు స్వతంత్రురాలివి. నువ్వింకా నన్ను ప్రేమిస్తున్నావా?" అడిగేడు ఆమె చెయ్యి పట్టుకుని.

"రేపు మా యింట్లో నా బర్త్‌డే పార్టీ. సాయంత్రం ఆరున్నరకి మీరు తప్పకుండా రావాలి. ఇలా ఆహ్వానించడానికే వొచ్చేను. ఇదిగో ఇన్విటేషన్‌కార్డ్." అంది.

"మీ నాన్నగారి చెంపదెబ్బ మరిచిపోయేననుకుంటున్నావా!" అన్నాడు వెంకట్రావు చెంప తడుముకుంటూ.

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానో లేదో తెలుసుకోడానికైనా మీరు రారా?"

"తప్పకుండా వస్తాను." అన్నాడు వెంకట్రావు కృతనిశ్చయుడై.

★ ★ ★

ప్రమీల బర్త్‌డే పార్టీకివెళ్లిన వెంకట్రావు, అక్కడ తనకంటే ముందే వొచ్చిన తన తల్లి తండ్రుల్ని చూసి ఆశ్చర్యపోయేడు. అంతేకాదు తను రావడం గమనించి అతని తండ్రి మైక్ అందుకుని కరతాళధ్వనులు మిన్నుముట్టుతుండగా "ఇది కేవలం ప్రమీల

జన్మదినోత్సవమేకాదు. ఇది ప్రమీలకి మా అబ్బాయి డాక్టర్ వెంకట్రావులకి త్వరలోనే జరగబోయే వివాహానికిది నిశ్చితార్థ శుభసమయం" ప్రకటించేడు.

"తొందరపడ్డావు నాన్నా! ముందు ప్రమీల తండ్రిగారు నాకు క్షమాపణ చెప్పుకోవల్సివుంది" అన్నాడు ఈ ప్రకటన విని నిర్ఘాంతపోయి తండ్రి చెవిలో రహస్యంగా.

"క్షమాపణ చెప్పవల్సింది కృష్ణకాదు. నీ వుత్తరం చూసి నాకు ఫోన్ చేసి నా సలహామీద నిన్ను చెంపదెబ్బకొట్టి ఇంతవాణ్ణి చేసినందుకు వాడికి నువ్వు కృతజ్ఞత చెప్పాలి." అన్నాడు తండ్రి.

"నువ్వు ఆయనచేత నన్ను కొట్టించేవా?" అడిగేడు వెంకట్రావు ఆశ్చర్యంగా.

"అవును. నువ్వానాడు గట్టిగా పట్టుపట్టేవనుకో, కాదంటే ఏ అఘాయిత్యం చేసుకుంటావోనని మీ అమ్మ భయపడింది. అంచేత ఈ బాధ్యత వాడికప్పగించేను." అన్నాడు వెంకట్రావు తండ్రి.

ప్రమీల తన తండ్రిని వెంటబెట్టుకుని వెంకట్రావు దగ్గిరకి తీసుకొచ్చింది. "ఆరోజున నడిరోడ్ మీద నా కాళ్లు పట్టుకునేటట్లు చేసిన పాపానికి నిష్కృతిగా పెద్దల సమక్షంలో నీ కాళ్లు కడిగి కన్యాదానం చేస్తాను. సరేనా!" అన్నాడు నవ్వుతూ డి.ఐ.జి. కృష్ణ.

** ఆకాశవాణి, హైదరాబాదు, 1998*